సాక్షి సిద్దిపేట

శుక్రవారం। 17। జనవరి। 2025



నవోదయం.. సర్వం సిద్ధం

నవోదయ ప్రవేశ పరీక్ష నిర్వహణకు జిల్లా యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది.

వివరాలు 8లో ▸



శభాష్ పోలీస్

ఆకలితో అలమటిస్తున్న ఓ వృద్ధురాలిని పోలీసులు గుర్తించి ఆదుకున్నారు.

వివరాలు 8లో ▸



యాప్‌ల పేరుతో బురిడీ

డబ్బు ఆశ చూపి అక్రమార్కులు యాప్‌ల పేరుతో మోసాలకు పాల్పడుతున్నారు.

వివరాలు 9లో ▸

కనులపండువగా
రాములోరి తెప్పోత్సవం

ధనుర్మాసోత్సవాల సందర్భంగా మిరుదొడ్డిలో రాములోరి తెప్పోత్సవం గురువారం అంగరంగ వైభవంగా సాగింది. స్థానిక సీతారామచంద్ర స్వామి ఆలయం నుంచి స్వామి వారి విగ్రహాలను భక్తులు పల్లకీలో ఉంచి శోభాయాత్ర నిర్వహించారు. రామ నామస్మరణతో కీర్తనలు ఆలపిస్తూ ప్రధాన వీధుల గుండా ఊరేగించారు. అనంతరం స్థానిక పెద్ద చెరువులో తెప్పోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. స్థానికులే కాకుండా వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై తెప్పోత్సవాన్ని తిలకించి పులకించి పోయారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. - మిరుదొడ్డి(దుబ్బాక)



పెద్ద చెరువులో రాములోరి తెప్పోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు

మల్లన్న హుండీ ఆదాయం
రూ.73.14 లక్షలు

కొమురవెల్లి మల్లికార్జునస్వామి హుండీల ద్వారా రూ.73.14 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి రామాంజనేయులు తెలిపారు. గురువారం ఆలయ ముఖ మండపంలో భక్తులు సమర్పించిన కానుకలను ఆలయ సిబ్బంది, శివరామకృష్ణ భజనమండలి సభ్యులు లెక్కించారు. 33 రోజులలో వచ్చిన ఈ ఆదాయాన్ని మెదక్ జిల్లా సహాయ కమిషనర్ చంద్రశేఖర్ సమక్షంలో లెక్కించినట్లు రామాంజనేయులు తెలిపారు. నగదు రూ. 73,14,488, విదేశీ కరెన్సీ నోట్లు 26, మిశ్రమ బంగారం 134 గ్రాములు, మిశ్రమ వెండి 9 కిలోల 300 గ్రాములు, పసుపు బియ్యం10 క్వింటాళ్లు వచ్చినట్లు తెలిపారు. - కొమురవెల్లి(సిద్దిపేట)



ఐదేళ్లుగా హుండీలోనే కానుకల ముల్లె..

ఓ ప్రధాన హుండీలో ఐదేళ్లుగా ఉన్న కానుకల ముల్లెను అధికారులు గుర్తించారు. ముల్లెపై ఉన్న తేదీ ఆధారంగా ఐదేళ్ల క్రితం వేసినట్లు భావిస్తున్నారు. ఇందులో 5గ్రాముల బంగారం, సుమారు 4.50కిలోల వెండి ఉంది. ఇప్పటి వరకు గుర్తించకపోవడం అనుమానాలకు తావిస్తోంది.

నగదును లెక్కిస్తున్న శివరామకృష్ణ భజన మండలి సభ్యులు

న్యూస్‌రీల్

'ఫీడ్ బ్యాక్'తో మరిన్ని సేవలు
సీపీ అనురాధ



సిద్దిపేటజోన్: పోలీస్ సేవలపై ప్రజల అభిప్రాయం తెలుసుకోవడానికి ప్రభుత్వం తయారు చేసిన క్యూఆర్ కోడ్‌ను సద్వినియోగం చేసుకోవాలని పోలీసు కమిషనర్ అనురాధ పిలుపునిచ్చారు. ఫిర్యాదు దారులు తమ అభిప్రాయాలను తెలపాలన్నారు. పోలీస్ కమిషనరేట్ పరిధిలోని అన్ని పోలీస్‌స్టేషన్లలో, సర్కిల్, ఏసీపీ కార్యాలయాల్లో క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేశామన్నారు. ఫిర్యాదు, పిటిషన్, ఎఫ్ఐఆర్, ఈ చాలాన్ ట్రాఫిక్ ఉల్లంఘన పాస్‌పోర్ట్, ఇతర అంశాలపై స్కాన్ చేసి అభిప్రాయాలను, రేటింగ్ ఇవ్వాలని సూచించారు. ప్రజల ఫీడ్ బ్యాక్ మేరకు మరిన్ని ఉన్నత సేవలు అందించడానికి అవకాశం ఉంటుందన్నారు.

మెరుగైన వైద్య సేవలందించండి
డీఎంహెచ్ఓ డాక్టర్ పల్వన్‌కుమార్



మందులు పరిశీలిస్తున్న పల్వన్‌కుమార్

గజ్వేల్‌రూరల్: రోగులకు మెరుగైన వైద్యసేవలందించాలని డీఎంహెచ్ఓ డాక్టర్ పల్వన్‌కుమార్ వైద్యులకు, సిబ్బందికి సూచించారు. గజ్వేల్‌లోని, ఆర్అండ్ఆర్ కాలనీలోని బస్తీ దవాఖానాలను గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా రికార్డులను తనిఖీ చేసి మందుల నిల్వలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రాలకు వచ్చే ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ వారికి నాణ్యమైన వైద్యసేవలందించాలన్నారు. మాస్కులు, శానిటైజర్లు ఉపయోగించాలన్నారు. కాలం చెల్లిన మందులను తొలగించాలని, సాధారణ ప్రసవాల సంఖ్య పెంచాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ శ్రీనివాస్, వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

సాగుకు యోగ్యంకాని భూముల గుర్తింపు



భూములు పరిశీలిస్తున్న అధికారులు

మద్దూరు(హుస్నాబాద్): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రైతుభరోసా పథకంలో భాగంగా మద్దూరులో వ్యవసాయానికి అనువుగాని భూములను జిల్లా వ్యవసాయ అధికారి రాధిక గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రియల్ ఎస్టేట్, మైనింగ్, పరిశ్రమలు, రాళ్లు రప్పలు కొండలుగా ఉన్న భూములు సాగుకు అనుకూలం కాదన్నారు. అలాంటి భూముల వివరాలను సమగ్రంగా సేకరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రహీమ్, మండల వ్యవసాయధికారి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

వర్గల్(గజ్వేల్): మండల పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుంది. నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు నేపథ్యంలో నెంటూరు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ వాసుదేవరావు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

మేం రాలేం..!

మాతృశాఖలోకి తిరిగి వచ్చేందుకు వీఆర్వో, వీఆర్ఏల అనాసక్తి

- బీఎల్ఓకు 301 సర్వేయర్‌గా 49 మంది ఆసక్తి
- రెవెన్యూ శాఖకు పూర్తి వివరాలు పంపిన అధికారులు



వీఆర్వో, వీఆర్ఏలు తిరిగి మాతృశాఖలోకి వచ్చేందుకు ఆసక్తి చూపడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల భూ భారతి చట్టాన్ని అమల్లోకి తీసుకువచ్చింది. గ్రామ రెవెన్యూ వ్యవస్థను పునరుద్ధరణ, బలోపేతం చేసేందుకు గ్రామ స్థాయి అధికారులు, సర్వేయర్లుగా నియమించాలని ప్రభుత్వం నిర్ణయించింది. గతంలో రెవెన్యూ శాఖలో పని చేసిన వీఆర్వో, వీఆర్ఏ వ్యవస్థను రద్దు చేసి పలు శాఖలకు బదలాయించింది. తిరిగి రెవెన్యూ శాఖలోకి తీసుకునేందుకు ఆసక్తి ఉన్న వారి నుంచి గత నెల 28వ తేదీవరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించారు. అయితే వారు అంతగా మొగ్గు చూపడంలేదని తెలుస్తోంది.

సాక్షి, సిద్దిపేట: గతంలో రెవెన్యూ శాఖలో పని చేసిన వీఆర్వో, వీఆర్ఏలు దాదాపు 30శాఖల్లో జూనియర్ అసిస్టెంట్, ఆఫీస్ సాబార్డినేట్‌గా నియమించారు. మున్సిపల్, రిజిస్ట్రేషన్, విద్యాశాఖ, మెడికల్, ఇరిగేషన్‌లతో పాటు పలు శాఖల్లో విధులు నిర్వర్తించే వారు తిరిగి రెవెన్యూలోకి వచ్చేందుకు మొగ్గు చూపడం లేదు. ఆయా శాఖల్లో విధుల్లో చేరి మూడేళ్లు కావస్తుండటంతో పదోన్నతులు వస్తాయని, అదే రెవెన్యూలో అయితే పదోన్నతులు ఆలస్యంగా వస్తాయని వచ్చేందుకు ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది. ఇప్పుడు చేసిన సర్వీస్ ఇస్తారో ఇవ్వరో...? ఇప్పుడైతే కార్యాలయంలో ఉంటూ ఉద్యోగం చేసుకుంటున్నామని మళ్లీ ఎందుకు వెళ్లడం అని పలువురు పూర్వపు వీఆర్వో, వీఆర్ఏలు చర్చించుకుంటున్నారు. నూతన వ్యవస్థకు సంబంధించి సర్వీస్ రూల్స్, నిర్ధారణ కాకపోవడమే ఇందుకు ప్రధాన కారణంగా చెబుతున్నారు. తిరిగి రెవెన్యూలోకి వెళ్తామని కాన్సెంట్ ఇచ్చిన వారిలో సైతం సుమారుగా 15 మంది వెళ్లమని కలెక్టరేట్ ఏవో వద్ద తమ ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలిసింది.

అర్హతల వారీగా

జిల్లా వ్యాప్తంగా గతంలో వీఆర్ఏలు 1,049, వీఆర్వోలు 365 మందిని వివిధ శాఖల్లో బదలాయించారు. తిరిగి రెవెన్యూ శాఖలోకి తీసుకునేందుకు ఆప్షన్లను డిసెంబర్ 28వ తేదీ వరకు స్వీకరించారు. డిగ్రీ, ఇంటర్, ఇంటర్ లోపు విద్యార్హతల ఆధారంగా లెక్కలు తీశారు. బీఎల్ఓకు 301, సర్వేయర్‌కు49 మంది దరఖాస్తు చేశారు. కలెక్టరేట్‌లోని సిబ్బంది ద్వారా ఈ వివరాలు అన్ని క్రోడీకరించి రెవెన్యూ శాఖకు పంపించారు. మెజార్టీ మంది సొంత శాఖకు తిరిగి వచ్చేందుకు ఆసక్తి చూపినట్లుగా దరఖాస్తుల ఆధారంగా స్పష్టమవుతోంది.

> **వివరాలు పంపించాం**
>
> పూర్వపు వీఆర్వో, వీఆర్ఏలందరికీ ఫోన్లు చేసి సమాచారం అందించాం. వారికి గూగుల్ ఫారం పంపించాం. ఆసక్తి ఉన్న వారు దరఖాస్తును నింపారు. ఆసక్తి ఉన్న వారికి విద్యార్హతల పరిశీలించి, వాటిని ఉన్నతాధికారులకు పంపించాం. రెవెన్యూ శాఖ నుంచి నిర్ణయం వస్తే దాని ప్రకారం ముందుకు సాగుతాం.
>
> -అబ్దుల్ రహమాన్, ఏఓ, కలెక్టరేట్

● కంపుకొడుతున్నాయి..



రైతుబజార్ సమీపంలో మురుగు కాలువ దుస్థితి



విక్టరీ చౌరస్తా సమీపంలో...

జిల్లా కేంద్రంలోని ప్రధాన మురుగు కాలువలు కంపుకొడుతున్నాయి. వ్యర్థాలు నిండిపోవడంతో మురుగు నిలిచి దుర్వాసన వ్యాపిస్తోంది. మున్సిపల్ అధికారులు కాలువలు శుభ్రం చేయించడంపై దృష్టి సారించడంలేదని స్థానికులు మండిపడుతున్నారు. గతంలో స్వచ్ఛత పేరుతో బయట చెత్త వేస్తే జరిమానా విధించిన అధికారులు ఇప్పుడు ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తుండటంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని వారు కోరుతున్నారు.

-సాక్షి, స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సిద్దిపేట

ఫామ్‌హౌస్‌లో వెదురు మొక్క నాటిన హిమాన్షు

మర్కూక్(గజ్వేల్): ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో గురువారం మాజీ సీఎం కేసీఆర్ మనవడు, మాజీ మంత్రి కేటీఆర్ తనయుడు హిమాన్షు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. విదేశాలలో ఉండి గురువారం వ్యవసాయక్షేత్రానికి చేరుకున్నారు. తాత కేసీఆర్‌తో కలిసి వెదురు మొక్క నాటి ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు.



మొక్కను నాటుతున్న హిమాన్షు, పక్కన కేసీఆర్

మాకు రేషన్ కార్డులు రావా?

- సర్వే లిస్టులో మా పేర్లు లేవు
- పాలమాకుల గ్రామస్తుల నిలదీత
- మళ్లీ దరఖాస్తులు స్వీకరించిన అధికారులు



తహసీల్దార్‌కు సమస్య వివరిస్తున్న గ్రామస్తులు

నంగునూరు(సిద్దిపేట): 'కొన్నేళ్లుగా కొత్త రేషన్ కార్డులు రాక ఇబ్బందులు పడుతున్నాం.. అధికారుల తప్పిదంతో సర్వే లిస్టులో మాపేర్లు గల్లంతయ్యాయి. మాకు రేషన్ కార్డులు రావా' అంటూ పాలమాకుల గ్రామస్తులు అధికారులను నిలదీశారు. గురువారం నంగునూరు, పాలమాకుల, గట్లమల్యాల, సంతోష్‌నగర్, కోనాయిపల్లి గ్రామాల్లో రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల సర్వే నిర్వహించారు. పాలమాకులలో తహసీల్దార్ సరిత అధికారులతో కలిసి గ్రామానికి చేరుకొని ఇంటింటా సర్వే చేపట్టారు. రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నా తమ పేర్లు జాబితాలో ఎందుకు లేవని ప్రశ్నించారు. ఉన్నతాధికారుల నుంచి వచ్చిన జాబితా ప్రకారం సర్వే చేస్తున్నామని తహసీల్దార్ సమాధానం ఇచ్చారు. గ్రామంలో సుమారు 900 మంది కొత్త రేషన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకున్నామని తెలిపారు. పూర్తి జాబితా వచ్చేంత వరకు సర్వే చేయవద్దని అడ్డుకున్నారు. సర్వేను అడ్డుకోవద్దని అధికారులు చెప్పినా వినకపోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. గ్రామస్తుల వినతి మేరకు తహసీల్దార్ సరిత కలెక్టర్, సివిల్ సప్లై అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యను వివరించారు. వారి సూచన మేరకు గ్రామస్తుల నుంచి మళ్లీ దరఖాస్తులు స్వీకరించారు. అలాగే నంగునూరు, కోనాయిపల్లి గ్రామాల ప్రజలు కూడా సర్వేలో తమ పేర్లు లేవని ఆవేదన వ్యక్తం చేశారు.

పకడ్బందీగా రేషన్ కార్డుల సర్వే

కమిషనర్ రమేశ్‌కుమార్

దుబ్బాక: ప్రభుత్వ ఆదేశాల మేరకు మున్సిపాలిటీలో రేషన్‌కార్డుల సర్వే పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ రమేశ్‌కుమార్ తెలిపారు. గురువారం మున్సిపల్ పరిధిలోని దుంపలపల్లిలో రేషన్‌కార్డుల సర్వేను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన పేదలందరికీ రేషన్‌కార్డులు అందుతాయన్నారు. ఎలాంటి అవకతవకలకు తావివ్వకుండా పారదర్శకంగా సర్వే చేపడుతున్నామన్నారు. ప్రజలు సర్వేకు సహకరించాలన్నారు. మున్సిపాలిటీలోని అన్ని వార్డుల్లో సర్వే చేపట్టి కొత్త రేషన్‌కార్డులు మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఇల్లందుల శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



సర్వేలో కమిషనర్ రమేశ్‌కుమార్

అనాథ పిల్లలకు అండగా నిలుద్దాం

గజ్వేల్‌రూరల్: తల్లిని కోల్పోయి తండ్రికి దూరమైన అనాథ పిల్లలకు అండగా నిలుద్దామని స్వచ్ఛంద సేవా సంస్థల సభ్యులు పిలుపునిచ్చారు. మండలంలోని బంగ్లావెంకటాపూర్‌కు చెందిన మాస్టి నాగమణి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, తండ్రి ఆచూకీ లేకపోవడంతో అనాథలుగా మారిన ముగ్గురు పిల్లలను 'మనం' ఫౌండేషన్, ఆర్థిక చేయూత ఫౌండేషన్(ఏసీఎఫ్) సభ్యులు గురువారం పరామర్శించి మనోధైర్యం కల్పించారు. రూ.10వేల నగదుతో పాటు 50కిలోల బియ్యం, నిత్యావసర సరుకులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తల్లిదండ్రులకు దూరమైన పిల్లలను ఆదుకునేందుకు దాతలు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు స్వామి, కనకయ్య, ఆంజనేయులు, కొండల్‌రెడ్డి, మల్లికార్జున్, వెంకటేష్, వెన్నెల స్వామి, మధుబాబు, ఎల్లం రాజు, చింతకింది స్వామి, బాబు, భిక్షపతి, సత్యనారాయణ, రమేష్, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.



నగదు అందిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

'ఆత్మీయ భరోసా' లేనట్లే?

- మల్లన్నసాగర్ నిర్వాసితులకు మరో దెబ్బ!
- జలాశయం నిర్మాణంలో సర్వం కోల్పోయి.. భూమి లేని పేదలుగా మారిన వైనం
- పథకం వర్తించదన్న సంకేతాలతో ఆందోళన బాట
- గజ్వేల్ ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా



ఆర్డీఓ వీవీఎల్ చంద్రకళకు వినతి పత్రం అందజేస్తున్న నిర్వాసితులు

గజ్వేల్: మల్లన్నసాగర్ నిర్వాసితులకు మరో షాక్ తగిలింది. పెండింగ్ సమస్యలు పరిష్కారానికి నోచుకోక ఇప్పటికే తీవ్ర ఇబ్బందుల్లో ఉన్న నిర్వాసితులకు 'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా' కూడా అందేలా లేదు. జలాశయ నిర్మాణంలో సర్వం కోల్పోయి భూమిలేని రైతు కూలీలుగా మారిన నిర్వాసితులకు గతంలో భూమికి పరిహారం ఇచ్చామనే కారణంతో ఏడాదికి రూ.12వేలు ఇచ్చే ఈ పథకాన్ని వర్తింపజేసే అవకాశం లేదని తెలుస్తున్నది. అన్ని గ్రామాలకు పథకానికి సంబంధించిన జాబితాలకు విడుదల కాగా ఆర్అండ్ఆర్ కాలనీకి సంబంధించి మాత్రం ఇంకా జాబితా వెలువడకపోవడం అనుమానాలకు బలం చేకూరుస్తున్నది. ఈ క్రమంలో నిర్వాసితులు ఆందోళనబాట పట్టారు. గురువారం గజ్వేల్‌లోని ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు.

ఏళ్లుగా తీరని సమస్యలు..

మల్లన్నసాగర్ జలాశయ నిర్మాణం వల్ల తొగుట మండలంలో పల్లెపహాడ్, వేములగాట్, ఏటిగడ్డ కిష్టాపూర్, లక్ష్మాపూర్, రాంపూర్, బ్రాహ్మణ బంజేరుపల్లి, కొండపాక మండలం సింగారం, ఎర్రవల్లి గ్రామాలు పూర్తిగా ముంపునకు గురైన విషయం కూడా విదితమే. ఆయా ముంపు గ్రామాలకు చెందిన నిర్వాసితులకు గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ముట్రాజ్‌పల్లి, సంగాపూర్ గ్రామాల పరిధిలో ఆర్అండ్ఆర్ కాలనీ నిర్మించి ఇచ్చిన సంగతి తెలిసిందే. ఏటిగడ్డకిష్టాపూర్‌లో 1253, లక్ష్మాపూర్‌లో 388, వేములగాట్‌లో 1252, పల్లెపహాడ్‌లో 921, రాంపూర్‌లో 320, బ్రహ్మణ బంజేరుపల్లిలో 267, ఎర్రవల్లిలో 800, సింగారంలో మరో 330కుపైగా కుటుంబాలున్నాయి. కాగా ఆయా గ్రామాల్లో భూమితో ఇతర ఆస్తులకు పరిహారం ఇవ్వడంతోపాటు ప్రతి కుటుంబానికి ఆర్అండ్ఆర్ ప్యాకేజీ కింద రూ.7.5లక్షలు, ఇల్లు. ఇల్లు వద్దంటే వారికి ఓపెన్ ప్లాటు, మరో రూ.5లక్షలు పంపిణీ చేశారు. అంతేకాకుండా కుటుంబంలో 18ఏళ్ల పైబడిన వారుంటే ఇల్లు లేదంటే ఓపెన్ ప్లాటు, రూ.5లక్షలు ఇచ్చారు. ఇంకా ఎన్నో సమస్యలు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయి. పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం నిర్వాసితులు గత కొన్నేళ్లుగా చేయని ప్రయత్నాలు లేవు. పలుసార్లు నిరసన కార్యక్రమాలను చేపట్టారు. అయినా ఏళ్ల బరబడి ఈ సమస్యలు తీరడం లేదు.

నిర్వాసితుల్లో ఆందోళన..

ఇదే క్రమంలో తాజాగా భూమిలేని పేదలకు ఏడాదికి రూ.12వేల పంపిణీ చేసే 'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా' పథకం వర్తింపజేసే అవకాశం లేదని తెలిసి నిర్వాసితులు ఆందోళన చెందుతున్నారు. భూములకు గతంలో పరిహారం వచ్చిందనే కారణంతో ఈ పథకాన్ని వర్తింపజేయడం లేదని తెలుస్తున్నది. జలాశయం నిర్మాణంలో సర్వం కోల్పోయి, ప్రస్తుతం గుంట వ్యవసాయ భూమిలేని స్థితిలో మెజార్టీ నిర్వాసితులు ఉన్నారు. వీరి కోసం పరిశ్రమలను స్థాపించి ఉపాధి కల్పిస్తామన్న ప్రభుత్వ హామీ కూడా నెరవేరలేదు. మరో ముఖ్యమైన విషయమేమీటంటే ఉపాధి హామీ పథకం కూడా ఈ గ్రామాలకు వర్తించడం లేదు. పని దొరకక భూమిలేని పేదలు అల్లాడుతున్నారు. వారంతా ఆందోళన బాటపట్టారు.

ఆందోళన ఉధృతం చేస్తాం

భూమి లేని తమకు 'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా' ఏడాదికి రూ.12వేల పంపిణీ చేసే పథకాన్ని వర్తింపజేయాలని డిమాండ్ చేస్తూ మల్లన్నసాగర్ నిర్వాసితులు గురువారం గజ్వేల్‌లోని ఆర్డీఓ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. వీరికి డీబీఎఫ్(దళిత బహుజన ఫ్రంట్) జాతీయ కార్యదర్శి పి. శంకర్, రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండస్వామి, జిల్లా కార్యదర్శి వేణులు మద్దతు పలికారు. ఈ సందర్భంగా ఆర్డీఓ వీవీఎల్ చంద్రకళకు వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వం స్పందించపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

కలెక్టర్‌ను కలిసిన డీడబ్ల్యూఓ



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న లక్ష్మీకాంత్‌రెడ్డి

సిద్దిపేటరూరల్: జిల్లా సంక్షేమ శాఖ అధికారిగా జి.లక్ష్మీకాంత్‌రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మను చౌదరిని మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. హన్మకొండ జిల్లా సంక్షేమ శాఖ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహించిన లక్ష్మీకాంత్‌రెడ్డి పదోన్నతిపై జిల్లాకు వచ్చారు. ఇప్పటివరకు డీడబ్ల్యూఓగా అదనపు బాధ్యతలు నిర్వహించిన శారద సిద్దిపేట సీడీపీఓగా విధులు నిర్వహించనున్నారు.

క్లుప్తంగా

చేపల వేటకు వెళ్లి మత్స్యకారుడు మృతి


నాగరాజు (ఫైల్)

హత్నూర(సంగారెడ్డి): చేపలు పట్టేందుకు వెళ్లి చెరువులో మునిగి మత్స్యకారుడు మృతి చెందిన ఘటన హత్నూర మండలం మధుర గ్రామ శివారులో గురువారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మధుర గ్రామానికి చెందిన లింగన్న గారి శోభ, ఎల్లయ్య దంపతుల పెద్ద కుమారుడు నాగరాజు(38) ఎప్పటిలాగానే గ్రామ శివారులోని దామర చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లాడు. చేపల కోసం వేసిన వల తీస్తున్న క్రమంలో ఒక్కసారిగా కాళ్లకు తట్టుకొని నీటిలో మునిగిపోయాడు. అటు వెళ్తున్న నాగరాజు సోదరుడు అనిల్ చెరువులో అన్న మృతదేహాన్ని గుర్తించాడు. విషయం గ్రామస్తులకు, కుటుంబీకులకు చెప్పడంతో అక్కడికి చేరుకొని బోరున విలపించారు. మృతుడి భార్య నర్సమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

మహా సభలను జయప్రదం చేయండి

సదాశివపేట(సంగారెడ్డి): జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో నిర్వహించ తలపెట్టిన సీపీఎం రాష్ట్ర నాలుగో మహాసభలను జయప్రదం చేయాలని సీపీఎం ఏరియా కమిటీ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంగారెడ్డిలో 25 నుంచి 28 వరకు మహాసభలు జరుగుతాయని పేర్కొన్నారు. మహాసభలకు ప్రజలందరూ భారీగా హాజరై విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రమేశ్ గౌడ్, భూషణం, ఏసోబు, నాగరాజు, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

సెల్‌టవర్ ఎక్కి వృద్ధుడు నిరసన


పోలీసుల అదుపులో నారాయణ

నిజాంపేట(మెదక్): సెల్‌టవర్ ఎక్కి వృద్ధుడు నిరసన వ్యక్తం చేసిన ఘటన నిజాంపేటలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని చల్మెడ గ్రామానికి చెందిన బొమ్మ చిన్న నారాయణ అనే వృద్ధుడు కౌలు డబ్బుల విషయంలో తనకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం సెల్ టవర్ ఎక్కి నిరసన వ్యక్తం చేశాడు. తాను అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి వద్ద పొలం కౌలుకు చేస్తుండగా, కౌలు డబ్బులు ఇవ్వడం లేదని వెంటనే ఇప్పించాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న ఏఎస్‌ఐ జైపాల్‌రెడ్డి వృద్ధుడిని సముదాయించి కిందికి దిగిన తర్వాత కస్టడీలోకి తీసుకున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో ఉరేసుకొని ఆత్మహత్య

గజ్వేల్‌రూరల్: ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గురువారం గజ్వేల్ పట్టణంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పట్టణానికి చెందిన గౌరీశెట్టి వేణు(46)కు భార్య అలేఖ్య, ఇద్దరు పిల్లలున్నారు. వేణు పట్టణంలో అపూర్వ షాపింగ్‌మాల్‌ను నిర్వహిస్తున్నాడు. సంక్రాంతి పండుగకు ముందే అలేఖ్య పిల్లలతో కలిసి పుట్టింటికి వెళ్లింది. కొంతకాలంగా కుటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందులతో తీవ్ర మనస్తాపానికి గురైన వేణు గురువారం ఇంట్లో ఫ్యాన్‌కు చున్నీతో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

సోషల్ మీడియాలో యువతి వీడియోలు

యువకుడిపై కేసు నమోదు

కల్హేర్(నారాయణఖేడ్): సోషల్ మీడియాలో అసభ్యకరంగా యువతి ఫొటోలు, వీడియోలు పెట్టిన యువకుడిపై గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు. కల్హేర్ ఎస్‌ఐ వెంకటేశం కథనం ప్రకారం.. నిజాంపేట మండలం బాచేపల్లి గ్రామానికి చెందిన ఓ యువతి ఫొటోలు, వీడియోలు అదే గ్రామానికి చెందిన చాకలి రాజు ఫేస్‌బుక్‌లో పెట్టాడు. ఈ విషయమై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. చాకలి రాజుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

ఇక్రిశాట్ బొమ్మ.. జై కొట్టాలమ్మ

సంగారెడ్డి జిల్లా పరిధిలోని రామచంద్రపురం లో ఏర్పాటు చేసిన ఇక్రిశాట్ (మెట్ట ప్రాంత పంటల అంతర్జాతీయ పరిశోధన కేంద్రం) లో గ్రామీణ వాతావరణం ఉట్టి పడేలా బొమ్మలు ఏర్పాటు చేశారు. యాభై ఏళ్ల కిందట ఏర్పాటు చేసిన ఇక్రిశాట్‌లో ఈ బొమ్మలు చూస్తే అప్పటి గ్రామీణ జీవన విధానం కళ్లకు కట్టినట్టు కనిపిస్తుంది. పూరి గుడిసె, ఎడ్లతో వ్యవసాయం చేస్తున్న రైతు, నెత్తిన జొన్నకట్టెల మోపుతో మహిళ, ధాన్యం దంచుతున్న మహిళలు, ఇసుర్రాయి విసురుతూ, రొట్టెలు చేస్తున్నటువంటి బొమ్మలు ప్రత్యేక ఆకర్షణగా ఉన్నాయి.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి



రామచంద్రాపురంలోని ఇక్రిశాట్


ఎడ్లతో వ్యవసాయం చేస్తున్న రైతు


రైతుల పూరిగుడిసె


కట్టెల పొయ్యి దగ్గర రొట్టెలు చేస్తూ..


జొన్న కట్టె మోపుతో ఉన్న మహిళ


ధాన్యం దంచుతున్న మహిళలు


ధాన్యం విసురుతూ..

నవోదయం.. సర్వం సన్నద్ధం

రేపే ప్రవేశ పరీక్ష

- రాయనున్న 6,465 మంది విద్యార్థులు
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 30 కేంద్రాలు
- నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు
- సందేహాల నివృత్తికి 'హెల్ప్ డెస్క్'
- వివరాలు వెల్లడించిన ప్రిన్సిపాల్ రాజేందర్



వర్గల్ నవోదయ విద్యాలయం

హెల్ప్ డెస్క్ నంబర్లు:

ఎం. శ్రీనివాస్‌రావు (జేఎస్‌వీఎస్‌టీ ఇన్‌చార్జి): 73823 35164
ఎం.జీ. సోని (ఎల్‌డీసీ): 94489 01318
దాసి.రాజేందర్ (నవోదయ ప్రిన్సిపాల్): 99215 55310

వర్గల్(గజ్వేల్): ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శనివారం నవోదయ ప్రవేశ పరీక్ష నిర్వహణకు జిల్లా యంత్రాంగం సర్వం సన్నద్ధమైంది. పరీక్షలో కనబర్చిన ప్రతిభ ఆధారంగా 2025–26 విద్యా సంవత్సరంలో విద్యార్థులకు ఆరో తరగతిలో ప్రవేశం కల్పిస్తారు. ఈ పరీక్ష నిర్వహణ కోసం మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాలకు చెందిన విద్యాశాఖ అధికారులు, వర్గల్ నవోదయ అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. విధి విధానాలపై జిల్లాల వారీగా సెంటర్ లెవెల్ అబ్జర్వర్లు, సెంటర్ సూపరింటెండెంట్లకు ఓరియంటేషన్ కార్యక్రమం సైతం నిర్వహించారు. పరీక్ష వేళ విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు సందేహాలు నివృత్తి చేసేందుకు ప్రత్యేక 'హెల్ప్‌డెస్క్' ఏర్పాటు చేశారు.

ఉమ్మడి జిల్లాలో 30 పరీక్ష కేంద్రాలు

- నవోదయ ప్రవేశ పరీక్షకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 6,465 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. వీరి కోసం వివిధ ప్రాంతాల్లో 30 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు.
- సిద్దిపేట జిల్లాలో 2,250 మంది విద్యార్థులకు 10 పరీక్ష కేంద్రాలు, మెదక్ జిల్లాలో 1,589 విద్యార్థులకు 8, సంగారెడ్డి జిల్లాలో 2,626 మందికి 12 కేంద్రాలు ఏర్పాటు చేశారు.
- పారదర్శకంగా పరీక్ష నిర్వహించేందుకు ప్రతీ కేంద్రంలో ఒక సెంటర్ సూపరింటెండెంట్, ఒక సెంటర్ లెవల్ అబ్జర్వర్‌ను నియమించారు.
- 24 మంది విద్యార్థులకు ఒక గది, ఒక ఇన్విజిలేటర్ ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నారు. కేంద్రాలపై పర్యవేక్షణ బాధ్యతను మండల విద్యాధికారులకు అప్పగించారు.
- ప్రవేశ పరీక్ష సజావుగా నిర్వహణకు 8న జిల్లా ప్రధాన కేంద్రాలలో శిక్షణ, అవగాహన కార్యక్రమం సైతం పూర్తి చేశారు.

గంట ముందే కేంద్రానికి చేరుకోవాలి

- నవోదయ ప్రవేశ పరీక్ష శనివారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు జరుగుతుంది. అభ్యర్థులు తొందరపాటుకు, ఒత్తిడికి గురి కాకుండా గంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలి.
- తమ వెంట హాల్‌టికెట్ (అడ్మిట్ కార్డు), రైటింగ్ ప్యాడ్, బ్లూ లేదా బ్లాక్ బాల్ పాయింట్ పెన్ తీసుకొని రావాలి. పరీక్ష కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు ఉంటుంది.

మూడు భాగాలుగా పరీక్ష



నవోదయ ప్రవేశ పరీక్ష మూడు భాగాలుగా ఉంటుంది. అన్ని ఆబ్జెక్టివ్ టైప్ ప్రశ్నలే ఉంటాయి. 80 ప్రశ్నలకు 100 మార్కులు. ఒక్కో సమాధానానికి 1.25 మార్కులు. మేధాశక్తి ప్రశ్నలు 40, గణిత ప్రశ్నలు 20, భాషా పరీక్ష ప్రశ్నలు 20 ఉంటాయి. ఓఎంఆర్ షీట్‌లో ప్రశ్నకు సంబంధించిన జవాబుకు ఇవ్వబడిన నాలుగు వృత్తాల్లో సరైన వృత్తాన్ని లోపల ఖాళీ వదలకుండా, గీత దాటకుండా నిండుగా పెన్నుతో 'బబ్లింగ్' చేయాలి. సజావుగా పరీక్ష నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేశాం. శిక్షణ, పునశ్చరణ తదితర కార్యక్రమాలు ఉమ్మడి జిల్లాల అధికారులతో కలిసి సంయుక్తంగా పూర్తి చేశాం.

– రాజేందర్ ,నవోదయ ప్రిన్సిపాల్

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా, జైలు విధించిన ఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూ నాయక్ కథనం మేరకు.. బుధవారం నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 39 మందిని పట్టుకున్నాం. వాహనదారులను గురువారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా 16 మందికి రూ. 2 వేలు, మరో 21 మందికి రూ.1,500, ఒకరికి రూ.1,000 జరిమానా విధించినట్లు తెలిపారు. మరో వ్యక్తికి జరిమానాతోపాటు రెండు రోజులు జైలు శిక్ష విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

సంగారెడ్డిలో 17 మంది

సంగారెడ్డి క్రైమ్: సంగారెడ్డి పట్టణంలోని పాత బస్టాండ్, పోతిరెడ్డిపల్లి, చౌరస్తా, బైపాస్‌లోని గుర్రపు బొమ్మ వద్ద బుధవారం అర్ధరాత్రి డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించగా పలువురు పట్టుబడినట్టు ట్రాఫిక్ సీఐ సుమన్ కుమార్ తెలిపారు. పట్టుబడిన 17 మంది వాహనదారులను గురువారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి షకీల్ అహ్మద్ సిద్ధిఖీ ఐదుగురికి రూ.2,000 జరిమానా, మరో 12 మందికి రూ.1,500 జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

సిద్దిపేటలో 38 మంది

సిద్దిపేటజోన్: సిద్దిపేట పట్టణంలో, సరిహద్దుల్లో కొద్దిరోజులుగా పోలీసుల డ్రంకెన్ డ్రైవ్‌లో పెద్ద ఎత్తున మందుబాబులు చిక్కారు. వారిని గురువారం న్యాయస్థానంలో హాజరుపర్చగా ఒకరికి ఐదు రోజులు, మరొకరికి మూడు రోజుల జైలు శిక్ష, 36 మందికి రూ 74,500 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు. వివరాల్లోకి వెళ్తే.. సిద్దిపేట టూ టౌన్ సీఐ ఉపేందర్ ఆధ్వర్యంలో నర్సాపూర్ చౌరస్తా, ఎంపీడీఓ చౌరస్తా, వేములవాడ కమాన్, ఎల్లమ్మ దేవాలయం వద్ద డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించి పలువురిని పట్టుకున్నారు. వారిని గురువారం కోర్టులో హాజరుపర్చగా సిద్దిపేట సెకండ్ క్లాస్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ కాంతారావు 13 మందికి రూ.23,500 జరిమానా, ఒకరికి ఐదు రోజుల జైలు శిక్ష విధించినట్టు సీఐ పేర్కొన్నారు. అదే విధంగా ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో డ్రంకెన్ డ్రైవ్ చేపట్టగా 23 మంది మద్యం తాగి పట్టుబడ్డారు. వారిని న్యాయస్థానంలో హాజరుపర్చగా 23 మందికి రూ.56 వేలు జరిమానా, ఒకరికి మూడు రోజుల జైలు శిక్ష విధించినట్లు సీఐ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మద్యం సేవించి వాహనాలు నడపొద్దని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు.

ఒకరు జైలుకు

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల పోలీస్ స్టేషన్ పరిధిలో వారం రోజులుగా డ్రంకైన్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. ఇందులో మద్యం తాగిన ఓ వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గురువారం సంగారెడ్డి కోర్టులో హాజరుపరుచగా న్యాయమూర్తి రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్‌ఐ మహేశ్వర్‌రెడ్డి తెలిపారు.

దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి

మెదక్‌మున్సిపాలిటీ: దుకాణంలోకి ప్రవేశించి మాబావతోపాటు అన్న కొడుకుపై దాడికి పాల్పడిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని సిమెంట్ వ్యాపారి లింగమూర్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. మెదక్ పట్టణంలోని సాయినగర్ కాలనికి చెందిన తోట లింగమూర్తికి స్థానిక వెల్‌కమ్ బోర్డు వద్ద సిమెంట్, స్టీల్ దుకాణం ఉంది. ఇదే కాలనీకి చెందిన నరేందర్‌రెడ్డికి లింగమూర్తికి మధ్య డబ్బుల విషయంలో ఇటీవల గొడవలు జరిగాయి. గురువారం మధ్యాహ్నం నరేందర్ రెడ్డి 40 మందితో వచ్చి దుకాణంలో కూర్చున్న అంతోల్ల వెంకటేశం, తోట అఖిల్ ముఖేష్‌లపై దాడి చేసినట్లు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ నాగరాజు తెలిపారు.

మాజీ సర్పంచ్ ఇంట్లో చోరీ

రూ.లక్ష నగదు, 2 తులాల బంగారం, అరకిలో వెండి అపహరణ


వివరాలు సేకరిస్తున్న క్లూస్ టీమ్

వట్‌పల్లి(అందోల్): మాజీ సర్పంచ్ ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన ఘటన అందోలు మండల పరిధిలోని అక్సాన్‌పల్లి గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. మండలంలోని తాడ్మన్నూర్ మాజీ సర్పంచ్ లక్ష్మీ భర్తతో కలిసి కొన్నేళ్లుగా అక్సాన్‌పల్లి గ్రామంలో నివాసం ఉంటున్నారు. మియాపూర్‌లో కూడా వీరికి ఇల్లు ఉండగా 3న అక్కడికి వెళ్లారు. గురువారం ఉదయం వీరి ఇంటి పక్కన నివాసం ఉండే దశరథ్ అనే వ్యక్తి తలుపులు తెరిచి ఉండటాన్ని గమనించి ఫోన్ చేసి సమాచారం ఇచ్చాడు. భార్యాభర్తలు ఇంటికి చేరుకొని జోగిపేట పోలీసులకు విషయం చెప్పారు. ఏఎస్‌ఐ గౌస్‌తోపాటు పోలీసు సిబ్బంది ఇంటిని పరిశీలించగా సీసీ కెమెరాలు ధ్వంసం చేసి ఉన్నాయి. మాజీ సర్పంచ్ భర్త, పీఏసీఎస్ డైరెక్టర్ నర్సింలు ఇంట్లో రూ.లక్ష నగదుతోపాటు రెండు తులాల బంగారం, అరకిలో వెండి వస్తువులు చోరీకి గురైనట్లు జోగిపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ గౌడ్ పేర్కొన్నారు. అలాగే, అదే గ్రామంలోని మరికొందరి ఇళ్ల తాళాలను దొంగలు పగులగొట్టారు. వీరితోపాటు మాజీ సర్పంచ్ నారాయణరెడ్డి ఇంటి తాళం పగులగొట్టి రెండు ఎరువుల బ్యాగులు ఎత్తుకెళ్లి ఇంటికి కొంత దూరంలో పడేశారు. ఈ ఘటనలపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

దేవాలయాల్లో కన్నం..


తలుపునకు కన్నం వేసిన దొంగలు

కొల్చారం(నర్సాపూర్): దేవాలయాలే లక్ష్యంగా దొంగలు చోరీలకి పాల్పడిన ఘటన మండల కేంద్రంలోని రెండు వేర్వేరు గ్రామాల్లో గురువారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. రాంపూర్ గ్రామంలోని ఎల్లమ్మ దేవాలయం తలుపులకు కన్నం వేసిన దొంగలు అమ్మవారి ముక్కుపుడకతోపాటు వెండి కిరీటాన్ని ఎత్తుకెళ్లారు. ఎనగండ్ల గ్రామంలోని రేణుక ఎల్లమ్మ దేవాలయం తాళాన్ని పగులగొట్టి దొంగతనానికి యత్నించారు. దొంగతనాలపై సదరు దేవాలయ కమిటీ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దొంగలను త్వరలోనే పట్టుకుంటామని ఎస్‌ఐ మహమ్మద్ గౌస్ తెలిపారు.

సబ్‌స్టేషన్ నుంచి ఇనుప రాడ్లు

గజ్వేల్‌రూరల్: సబ్‌స్టేషన్‌లో నుంచి ఇనుప రాడ్లు చోరీకి గురైన ఘటన గురువారం చోటు చేసుకుంది. గజ్వేల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని అక్కారం శివారులో గల కోనాపూర్ వద్ద ఉన్న సబ్‌స్టేషన్‌లో విద్యుత్ శాఖకు సంబంధించిన 9 (డిశ్చార్జ్ రాడ్స్) ఇనుప రాడ్లను బుధవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు చోరీ చేశారు. ఈ విషయాన్ని గుర్తించిన ఆ శాఖ అధికారులు గజ్వేల్ పోలీసులకు సమాచారం అందించారు. విద్యుత్ శాఖ ఏఈ ఉదయ్‌శ్రీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఏడుగురు అరెస్టు

తూప్రాన్: పట్టణ కేంద్రంలో కత్తులతో వీరంగం సృష్టించిన ఏడుగురిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ శివానందం గురువారం పేర్కొన్నారు. సంక్రాంతి రోజు మంగళవారం పతంగుల విక్రయం విషయంలో కత్తులతో యువకులు వీరంగం సృష్టించిన సంగతి తెలిసిందే. అయితే, సిక్కు వర్గానికి చెందిన జగదీష్ సింగ్, అమర్‌జీత్ సింగ్, తూఫాన్ సింగ్, గోవింద్ సింగ్, బలరాంసింగ్, బల్‌జీత్‌సింగ్, తోఫన్‌సింగ్‌లుగా గుర్తించి అరెస్ట్ చేశామన్నారు. పట్టణంలోని కేశవనగర్‌లో తుమ్మల గణేశ్ దుకాణంపై కత్తులు, కర్రలతో దాడికి పాల్పడినట్లు పేర్కొన్నారు.

గంజాయి సేవిస్తూ పట్టుబడ్డ యువకులు

రామచంద్రాపురం (పటాన్‌చెరు): గంజాయి సేవిస్తూ ఆరుగురు యువకులు పోలీసులకు పట్టుబడ్డారు. పోలీసుల కథనం ప్రకారం.. రామచంద్రాపురం పట్ట ణంలోని రాయసముద్రం చెరువు కట్టపై బుధవారం రాత్రి కొందరు యువకులు గంజాయి తాగుతున్నారనే అనుమానంతో పోలీసులు దాడి చేశారు. వారి వద్ద నుంచి శాంపిల్స్ తీసుకొని పరీక్షించగా ఐదుగురు గంజాయి సేవించినట్లు తేలిందని పోలీసులు నిర్ధారించారు. గురువారం వారిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. పట్టుబడిన వారిలో మనోజ్ కాంత్, కృష్ణ, వినోద్ కుమార్, సురేశ్, హేమంత్ ఉన్నారు.

శభాష్ పోలీస్..

- మూడు రోజులుగా రోడ్డుపై వృద్ధురాలి అవస్థ
- స్వగ్రామానికి చేర్చి మానవత్వాన్ని చాటుకున్న పోలీసులు


వృద్ధురాలితో మాట్లాడుతున్న పోలీసులు

హుస్నాబాద్: చలికి వణుకుతూ, ఎండకు ఎండుతూ, ఆకలితో అలమటిస్తూ రోడ్డుపై దీనంగా పడి ఉన్న ఓ వృద్ధురాలిని స్వగ్రామానికి చేర్చి పోలీసులు శభాష్ అనిపించుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. భీమదేవరపల్లి మండలం బొల్లొనిపల్లికి చెందిన 70 ఏళ్ల వృద్ధురాలు వడ్లకొండ కొమురవ్వకు కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. హుస్నాబాద్ పట్టణంలో ఉంటున్న కుమారుడు అయిలయ్య మేస్త్రీ పని చేస్తుంటాడు. కుమారుడు తనపై చేయి చేసుకున్నాడని అలిగి తల్లి బయటికొచ్చింది. హుస్నాబాద్ పట్టణంలోని గాంధీ చౌరస్తాకి చేరి మూడు రోజులుగా చలికి వణుకుతూ, ఎండకు ఎండుతూ కన్న కొడుకు కోసం రోదిస్తూ అవస్థలు పడుతుంది. తిండితిప్పలు లేక నీరసంగా పడి ఉన్న వృద్ధురాలిని చూసి స్థానికులు చలించిపోయి భోజనం అందించారు. ఇది గమనించిన స్థానిక కౌన్సిలర్ గూళ్ల రాజు విషయాన్ని పోలీస్‌లకు చెప్పాడు. హుటాహుటినా హెడ్ కానిస్టేబుల్ మొగిలి నాయక్, కానిస్టేబుల్ దూద్య నాయక్ వృద్ధురాలి వద్దకు వచ్చి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సొంత డబ్బులతో కొమురమ్మను స్వగ్రామం బొల్లొనిపల్లెకు ఆటోలో పంపించారు. ఆపదలో ఉన్న వృద్ధురాలిని ఆదుకున్న పోలీసులను అందరూ అభినందించారు.

గిరిజనులకే పట్టాలు ఇవ్వాలి

రామచంద్రాపురం (పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని వెలిమెల తండాకు చెందిన భూములను పొజిషన్‌లో ఉన్న గిరిజనులకే ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కే. రాజయ్య డిమాండ్ చేశారు. గురువారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. అధికారులు కొంత మంది అనర్హులకు పట్టాలు ఇచ్చారని వాటిని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గిరిజనులకు జరిగిన అన్యాయంపై ప్రభుత్వం సమగ్ర విచారణ చేపట్టాలన్నారు. గిరిజనులు న్యాయపోరాటం చేస్తుంటే భయభ్రాంతులకు గురి చేయడం సరికాదన్నారు.

అదృశ్యమైన బాలిక శవమైంది

- అనుమానాస్పదంగా బావిలో మృతదేహం లభ్యం
- నెలల వ్యవధిలోనే అక్కాచెల్లెళ్లు మృతి
- రాయికోడ్ మండలం సంగాపూర్ గ్రామంలో విషాదం


బావిలో వైష్ణవి మృతదేహం

రాయికోడ్(అందోల్): వారం రోజుల కిందట అదృశ్యమైన బాలిక అనుమానాస్పదంగా బావిలో శవమై తేలింది. ఎస్‌ఐ నారాయణ కథనం మేరకు మండలంలోని సంగాపూర్ గ్రామానికి చెందిన ఎం .సతీష్, అనిత దంపతులకు ఇద్దరు కూతుర్లు. కొద్ది నెలల కిందట భార్యాభర్తల మధ్య గొడవలు జరగడంతో అనిత ఇస్నాపూర్‌లోని బంధువుల వద్ద ఉంటుంది. ఇటీవల చిన్నకూతురు హరిత (6) మృతి చెందినా అనిత అంత్యక్రియలకు రాలేదు. వీరి పెద్ద కూతురు వైష్ణవి సంగాపూర్ గ్రామంలో నానమ్మ ఇంటి వద్ద ఉంటోంది. 9వ తేదీన వైష్ణవి ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. నానమ్మ, తండ్రి చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. గురువారం గ్రామ శివారులోని ఓ వ్యవసాయ బావిలో స్థానికులు మృతదేహాన్ని గుర్తించి పోలీస్‌లకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చగా వైష్ణవి మృతదేహమేనని కుటుంబీకులు నిర్ధారించారు. బాలిక మృతిపై అనుమానాలున్నాయని నానమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నారాయణ తెలిపారు. కొన్ని నెలల వ్యవధిలోనే అక్కాచెల్లెళ్లు మృతి చెందడంపై సర్వత్రా అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

ప్రమాదవశాత్తు కాల్వలో పడి రైతు..

గజ్వేల్‌రూరల్: ప్రమాదవశాత్తు కాల్వలో పడి రైతు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని అహ్మదీపూర్‌లో గురువారం వెలుగు చూసింది. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన చాడ కిష్టారెడ్డి వ్యవసాయ పొలంలో వివిధ రకాల పంటలు సాగు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కూడవెల్లి వాగులో కలిసే పిల్లవాగులో వేసిన వ్యవసాయ మోటార్ పని చేయకపోవడంతో బుధవారం మధ్యాహ్నం సరి చేస్తుండగా ప్రమాదవశాత్తు వాగులో పడిపోయాడు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు, గ్రామస్తులు అక్కడికి చేరుకొని వాగులో గాలింపు చేపట్టినప్పటికీ ఆచూకీ లభించలేదు. గురువారం మరోసారి గాలించగా కిష్టారెడ్డి మృతదేహం లభ్యమైంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

అనుమానాస్పదంగా వ్యక్తి..

పటాన్‌చెరు టౌన్: అనుమానాస్పదంగా వ్యక్తి మృతి చెందిన ఘటన పటాన్‌చెరులో చోటు చేసుకుంది. ఎస్‌ఐ వెంకటరెడ్డి కథనం మేరకు.. పటాన్‌చెరు మండలం రామేశ్వరంబండ వీకర్ సెక్షన్ కాలనీలో ఉండే ఈర్ల గణేశ్ (40) సొంత ఇంటిని కొంతకాలం కిందట అమ్ముకొని నిజామాబాద్ జిల్లాలో ఉంటున్నాడు. మూడు రోజుల కిందట వీకర్ సెక్షన్ కాలనీలో బంధువు చనిపోవడంతో కుటుంబంతో కలిసొచ్చాడు. ఇక్కడే ఏదైనా పని చేసుకొని ఉందామని ఇంద్రేశం శివారులోని పాడుబడిన రైస్ మిల్లులో ఉంటూ అక్కడే కూలీ పని చేసుకుంటున్నాడు. బుధవారం రాత్రి అందరూ రైస్ మిల్లు వరండాలో నిద్రించగా తెల్లవారి చూసేసరికి గణేశ్ రైస్ మిల్ స్తంభానికి కట్టిన తాడుకు వేలాడుతూ చనిపోయి ఉన్నాడు. కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇచ్చి గణేశ్‌ను కిందకు దింపి చూడగా మెడపై గాయాలు ఉన్నాయి. మృతుడి భార్య రూప ఫిర్యాదు మేరకు పోలీసులు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేశారు.

దేవక్కపల్లెలో షార్ట్ ఫిలిం


షార్ట్ ఫిలింలో ఓ సన్నివేశం

బెజ్జంకి(సిద్దిపేట): రైతు రాజ్యం వచ్చేది ఎప్పుడు షార్ట్ ఫిల్మ్‌ను మండలంలోని దేవక్కపల్లె శివారులో గురువారం ప్రారంభించారు. రైతులు ఎదుర్కొంటున్న కష్టాలను చూపిస్తూ వాటిని పరిష్కరించే లక్ష్యంతో ఈ సినిమా తీసినట్లు నిర్మాత, హీరో సొల్లు అజయ్‌వర్మ తెలిపారు. ఈ సినిమాలో ఎమ్మెల్యేగా బీజేపీ రాష్ట్ర నాయకుడు కరివేద మహిపాల్‌రెడ్డి నటిస్తున్నాడని తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఆకెన భాస్కర్, హీరోయిన్‌గా మౌనశ్రీ, కమలాకర్, నర్సింహారెడ్డి, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.